

# తొలగిన తెరలు

పింగళి సుశీలాదేవి

ఆఫీసుకు వెళ్ళాలని తొందర తొందరగా తయారవుతూంది రమ. "అన్నం వడ్డించాను రామ్మా" అంటూ పిలుపు వచ్చింది వంటింట్లోంచి.

గబగబా నోట్లో మెతుకులు వేసుకొంటున్న రమను చూసి, "ఏమ్మా అంత తొందర?" కాస్త స్తిమితంగా కూర్చొని తించేయి, మళ్లీ సాయంకాలానికి వచ్చేది. టిఫిను కూడా తీసుకెళ్లవు. టిఫిను పట్టుకెళ్ళటము కూడా నామర్దే. ఏమిటో ఈ కాలం పిల్లల నాజూకులు" గొణుక్కొంటున్నది బామ్మ.

బామ్మ మాటలకు నవ్వు వచ్చింది రమకు "ఏం లేదు బామ్మా. ఇవ్వాళ మా ఆఫీసుకు క్రొత్త ఆఫీసరొస్తున్నాడు. అందుకని కాస్త ముందరే వెళ్ళాలని" గబగబా చేయి కడుక్కొని లేచింది రమ.

ఆఫీసులో తన సీట్లో కూర్చొని నిన్న ఒదిలి పెట్టిన డ్రాఫ్ట్ చూసుకొంటున్నది రమ.

ఇంతలో ఆఫీసరుగారి జీపు ఆఫీసు ముందు వచ్చి ఆగింది. ఆఫీసరు గారు ఆఫీసులోకి అడుగు పెట్టారు. అందరూ లేచి విష్ చేశారు రమ కూడా రాసుకొంటున్నదల్లా లేచి విష్ చేసింది. "ఎవరూ?" రమ మనస్సులో ఆశ్చర్యం, దిగ్భ్రమ కలిగింది ఒక్కసారిగా! అమాంతం షాక్ తగిలిన దానిలా చూస్తూ కొయ్యబారి పోయింది. ఆఫీసరు కూడా అదే స్థితిలో నున్నారు ఆఫీసులో స్టాఫ్ అంతా ఏమిటో అర్థంకాక ఆశ్చర్యంతో తిలకిస్తున్నారు వీళ్లిద్దరినీ. కొంతసేపటికి తేరుకొని ఆఫీసరుగారు తన రూమ్‌లోకి వెళ్లిపోయారు.

రమ కూర్చొని వర్క్ చేస్తున్నదన్న మాటేగాని మనసంతా చీకాకుతోనిండిపోయి అయోమయంగా తయారయ్యింది. తలపోటు కూడా ప్రారంభమయినట్లుగా వుంది మనసునిండా వెనుకటి ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నయ్. డ్రాఫ్ట్ నిండా తప్పులు పడుతున్నయ్. ఇక పని సాగదనుకొని సెలవురాసి ప్రక్కనున్న క్లర్క్‌కుఇచ్చి తిన్నగా ఇంటిదారిపట్టింది.

ఇంటికి వెళ్తున్న రమ మస్తిష్కంలోని ఆలోచనలు ఐదు ఏండ్ల వెనుకకు పరుగెత్తినయ్.

"ఐ. ఏ. యస్. పరీక్షకు వెళ్లినవాడు, ముందు ముందు కలెక్టరవబోయే వాడు తనకు అల్లుడు కాబోతున్నాడని నాన్న చాలా సంతోషించాడు తను కూడా అంత పెద్ద పదవిలో నున్నవాడు ఎక్కువ కట్నాని కాశపడకుండా తనను చూడంగానే పెళ్లికి వప్పుకొన్నందుకు చాలా సంతోషించి, మనస్సులోనే ఎన్నో ధన్యవాదా లర్పించింది అతని ఉదారబుద్ధికి రమ. ఆరోజు మొదటిరాత్రి. తన కిష్టమయిన రోజారంగు రిబ్బన్లతో రెండు జడలూ వేసుకొని, ఒక ప్రక్క మల్లెపూలు పెట్టుకొని, నీలి అంచులుగల పాము కుబుసములాంటి తెల్లని షిఫాన్ చీరా, దానిమీద ఆదేరంగు బ్లవుజు వేసుకొని, ఎన్నో వూహలతో, మధురమైన కోర్కెలతో మనుసిగ్గు దొంతరలు పెనవేసుకొనిరాగా భారంగా అడుగులువేస్తూ గదిలో అడుగు పెట్టింది రమ గదిలో సోఫాలో కూర్చొని అగరువత్తుల పొగలో సిగరెట్ పొగలను కలుపుతూ పుస్తకము చదువుతూన్న శ్రీకాంత్ తలెత్తి చూశాడు రమని. శ్రీకాంత్

తలెత్తి చూడటంతో అక్కడే నిలబడి పోయింది కాలి బొటనవ్రేలితో నేలరాస్తూ రమ. శ్రీకాంత్ లేచివచ్చి రెండు భుజాలు పట్టుకొని నడిపించుకొంటూవచ్చి సిగ్గుతో తలవంచుకుపోయిన రమ సిరస్సును తన మునివ్రేళ్లతో పైకి ఎత్తాడు

"రమా ఏమిటీవేషం, ఇంకా చిన్న పిల్లలాగా జడనిండా మల్లెపూలతో తెల్లని జరీ చీరెతో లక్ష్మీదేవిలాగా సాక్షాత్కరిస్తా వనుకొన్న ఈ "కాంత్"కు నిరాశ కల్గించావు ఆగిపోయాడు.

రమ అభిమానం దెబ్బతింది తన ఇష్టాలకు వ్యతిరేకంగా ఇంట్లో ఎవ్వరూ వ్యవహరించేవారు కాదు ఆఖరుకు నాన్నగారు కూడా ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. అన్నయ్య సరేసరి. తను ఒక్కతే గారాబు చెల్లెలవటం వలన అన్నయ్య కూడా ఎంతో అపురూపంగా చూసుకొనేవాడు తనను అటువంటిది ఇప్పుడు ఒకరి ఇష్ట ప్రకారంగా, వాళ్ల చేతిలో కీలు బొమ్మ లాగా, వాళ్ల క్రింది బానిసలాగా, ఇక వూహించలేక పోయింది. కండ్లనిండా నీరు క్రమ్మకుంది.

శ్రీకాంత్ గబగబా తన పెట్టె వద్దకు వెళ్లి ఒక పాకెట్ తెచ్చాడు "రమా ఇందులో ఏముందో చూడు నీకోసం ఏం తెచ్చానో"

రమ పాకెట్ విప్పి చూసింది. అందులో జరీతో మెరిసిపోతున్న తెల్లని కంచి పట్టు చీరె.

"రమా తొందరగా వెళ్లి ఆదుస్తులు మార్చుకొని ఈ వేషం తీసివేసేయ్. ఈ చీరెలో నేను వూహించిన నీ అందమన్ను పరవసింప జేయాలి. వూ, త్వరగా వెళ్ళు ప్లీజ్! మధురమైన క్షణాలు వృధా చేయకు. ఈ రోజుకోసం ఎన్ని కలలు కన్నానో తెలుసా. ఇన్ని రోజుల నుండీ ప్రయత్నించగా ఇప్పుడు సెలవు దొరికింది మధురమైన ఈ క్షణాలు నాకు తృప్తిగా ఆనందానిచ్చేవిగా ఉండాలి. వెళ్ళు" ఆదేశించాడు శ్రీకాంత్

బయటికివచ్చి రెండు జడలు విప్పదీసి ఒక్కజడ వేసుకొంటున్న తన్ను చూచి, 'అన్నగారి అభిమతమా" మేము చెపితే న్నావూ?" అపహాస్యం చేసింది వదిన.

వదిన హృదయంమీద వాలి నిశ్శబ్దంగా రోదించింది రమ "ఛ ఏమిటా పిచ్చివెళ్ళు" అంటూ కోప్పడి ముస్తాబు చేసింది వదిన.

తను పుట్టి పెరిగిన పరిసరాలను వదలి తనవారందరినీ వదలి, మరియొక వ్యక్తి జీవితముతో బంధించిన తన జీవితమునకు భవిష్యత్తులో పునాదులు వేసుకొనుటకు, అతనితో కలిసి, అందరికీ వీడ్కోలు చెప్పుతూ రైలు ఎక్కింది రమ

ఒకరోజు శ్రీకాంత్ ఆఫీసునుండి హడావుడిగావస్తూ "రమా, మా స్నేహితులందరమూ కలిసి రామప్పకు పిక్‌నిక్ ప్రోగ్రాము వేసుకొన్నాము వాళ్ళు వారి వారి భార్యలతో కూడా వస్తున్నారు మరి నీవు కూడా రెడీ అవ్వాలి ఈ పూటనే వెళ్లి ఈ రాత్రికి అక్కడ ట్రావెలర్స్ బంగళాలో బస చేస్తాము. రాత్రికి హంటింగ్‌ప్రోగ్రాము ఉంది ఆ కొండమాటున కీకారణ్యం, ఆ నిశ్శబ్ద వాతావరణంలోని కీచురాళ్ల సంగీతం, హంటరు ధ్వనికి భయపడి పారిపోయె అడవి జంతువులు, ఎంత ఇంట్రెస్టిగా ఉంటుందనీ వూ కానీ," అంటూ తొందరపెట్టాడు.

మర్నాడు ప్రొద్దున కాఫీ టిఫెన్లు అవి అయ్యాక అందరూ ఖబుర్లలోకిదిగారు. మాటల సందర్భములో తనకు పాటలు వచ్చని, ఇండియన్ నైటింగేల్, లతా మంగేష్కర్ పాటకూడా మా రమపాటక్రింద రద్దేననీ చెప్పాడు

ఇకనేం పాడించండంటూ అందరూ బలవంత పెట్టారు కానీ ఆ సమయంలో తనకు పాడాలనిపించలేదు అసలు ఎప్పుడయినా అంటే తనకు ఇష్టమయినపుడు, ఆనందంగా ఉన్నపుడు తెలియకుండానే పాడుకొంటూ ఉంటుంది. బలవంతంగా పాడాలంటే తనకు చాలా కష్టంగా ఉంటుంది. "పాడలేను" అని తప్పించుకొంది. కానీ శ్రీకాంత్ ముఖంలో రంగులు మారటము గమనించింది రమ.

"చేసేదిలేక ఇష్టంలేకపోయినాసరే మనసును సరిపెట్టుకొని శ్రీకాంత్ కిష్టమయిన "చందన చర్చిత' అష్టపదిని అందుకొన్నది. అందరూ పాట చాలా బాగుందనీ, అన్ని విద్యలలోను అపర సరస్వతీ దేవిలాంటి భార్యను కలిగియుండటము శ్రీకాంత్ అదృష్టమని చాలా పొగిడారు

కానీ ఇంటికి వచ్చిన తరువాతశ్రీకాంత్ చేత చీవాట్లు తప్పలేదు తనకు సభ్యత తెలియదన్నాడు అందరిముందరా తను చెప్పగానే పాట పాడక తనను ఇన్‌సల్టు చేశావన్నాడు. బి. ఏ. డిగ్రీ ఉండంగానేసరా! కొంచెము సభ్యతా, సంస్కారము నేర్చుకోవాలన్నాడు. అయినా తను నోరెత్తలేదు. నోట్లో పమిట చెంగు కుక్కుకుని కండ్లనుండి కాల్వలా కన్నీరు కారుస్తున్న తన్ను అసహ్యంగా చూస్తూ ఆఫీసుకు వెళ్లిపోయాడు ఆ నాలుగు గోడల మధ్యగల ఆ ఒంటరి వాతావరణంలో తన మనసు ఎంతగానో క్షోభించింది.

ప్రతిదీ తన ఇష్టము వచ్చినట్లుగానే చేస్తున్నా, తన ఇష్టాలకు పూర్తిగా రమను దిద్దుకోవాలని తాపత్రయపడేవాడుశ్రీకాంత్. అడపా దడపా స్వాతిజల్లులలాంటి శ్రీకాంత్ అభిరుచులతో రమ మనస్సు పూర్తిగా సహనాన్ని కోల్పోయింది.

ఒకరోజు అన్నం తింటున్న శ్రీకాంత్ "రమా ఈ కూర ఇలా వండద్దని నీకు చెప్పలా. వేపుడు చేయమంటే కూర ఎందుకు చేశావు?"

శ్రీకాంత్ కేకతో బూట్లు తుడుస్తున్న రమ గుండెల్లో రైళ్లు పరుగెత్తినయ్. అయినా ధైర్యాన్ని తెచ్చుకొంది. ఎప్పుడూ తను వేపుడే చేసేది. కానీ అలాగ వండితే తనకు ఇష్టం. అమ్మ ఎప్పుడూ కూరనే వండుతుండేది తనకిష్టమని ఈ ఒక్కసారికి అలాగ వండుదామని కూరచేసింది. కనీసం తనకు ఈ ఇంట్లో తన కిష్టమయిన కూర వండుకొని తినే స్వతంత్రం కూడాలేదు. తను కేవలం ఒక యంత్రం. శ్రీకాంత్ ఎటు మరనాక్కితే ఆవిధంగా తయారవ్వాలి తను.

ధైర్యం తెచ్చుకొని వంటింటి గుమ్మం దగ్గిర నిలబడి 'ఎప్పుడూ వేపుడే చేస్తున్నా కాబట్టి ఈ ఒక్కసారికి ఇలాగ వండాను' అంది.

"అలా చెయ్యొద్దు అని నీకు ఎన్నిసార్లు చెప్పాలి?" శ్రీకాంత్ గద్దించాడు. తనలోని వోర్పు నశించింది. ఏమయినాసరే తను ఇవాళ గట్టిగా మాట్లాడాలనుకొంది.

"ఏం అలా చేస్తేనే నా కిష్టం. ప్రతి రోజూ మీకిష్టమయిన విధంగానే చేస్తున్నా గదా! నా కోసం ఈ ఒక్కరోజుకు వోర్చుకోలేరూ?"

"స్కౌండ్రల్ మాటకు మాటా రెట్టించటమూనా?" అన్నం ముందునుంచి లేచి చెంప చెళ్లుమనిపించాడు. "ఏం చూసుకొని నీ కింత పొగరు? బి. ఏ. చదువుకొన్నాననీ, నా అంతట నేను పోషించుకోగల శక్తి ఉందనీ గర్వంతో మాట్లాడుతున్నావా? అదీ తెలుస్తుంది. మర్యాదగా

# తొలగిన తెరలు

ఉండేవారికే ఈ ఇంట్లో స్థానం". గబ గబా బట్టలు వేసుకొని బయటకు వెళ్లి పోయాడు.

దుఃఖం కట్టలు త్రెంచుకొని ప్రవ హించింది. తనకు మర్యాద లేదట. బి. ఏ. డిగ్రీ చూసుకొని గర్వమట అంటే తను అమర్యాదగా ప్రవర్తించినట్లూ, తనకు ఈ ఇంట్లో స్థానం లేదనేనా వారి అభి ప్రాయం. వారన్నట్లు తనను తను పోషించు కొనే శక్తి లేదా తన దగ్గిర. గబగబా ఒక ఉత్తరము వ్రాసి టేబుల్‌మీద పెట్టి, తను వూరి కెళ్లినట్లు అయ్య గారితో చెప్పమని నౌకరుతో చెప్పిబయలు దేరింది.

అకస్మాత్తుగా వచ్చిన తన్ను చూసి ఇంట్లో వాళ్లందరూ ఆశ్చర్యపోయారు నాన్నగారు విషయం గ్రహించుకొని, ఏదో ఇద్దరి మధ్యా తగాదా వచ్చినంతమాత్రము నవే తొందరపడి ఇలా రాగూడదని, మగ వాడు అతవేదయినా అంటే వోర్చుకోవాలి గానీ ఇలా చెప్పకుండా రావచ్చునా? మళ్లీ అతనివద్ద దిగవిడిచివస్తా పద అంటూ కోప్పడ్డారు ఏమయినాసరే తను వెళ్లనని మొండికేసింది. "అంతగా అయితే అతను వచ్చి తీసుకెళ్లినపుడే వెళుతుంది, అసలే దాని మనసు బాగోలేక ఇలా వచ్చిన పిల్లను మీరు మరీ సతాయిస్తారేమండీ" అంటూ తన బాధను అర్థం చేసుకొన్న అమ్మ సమర్థించింది. నాన్నగారు కొంచెం శాంతించారు

వూరికే ఉండలేక ఎన్నాళ్లు పుట్టింట్లో ఉంటుందని అడిగే ఇరుగూ పొరుగూ అమ్మలక్కలకు అమ్మ బాధపడుతూ చెప్పే సమాధానాలు తనకు బాధనూ, విసుగునూ కల్గిస్తూండేవి. అస్తమానం ఇంట్లో ఒంటరిగా కూర్చుంటే, ఏదో పోగొట్టు కొన్నదానిలా దిగులుగా అనిపించేది. తన స్నేహితులంతా పెళ్లిళ్లయి అత్తారిళ్లకు పోయి వారి భర్తలతో వారు సుఖంగా కాపురాలు చేసుకొంటున్నారు. కొందరు పెళ్లిళ్లుకాక ఉద్యోగాలు చేస్తున్నారు తన బ్రతుకే ఇలా నడి సముద్రంలో నావ లాగా తయారయ్యింది తలచుకొంటే ఏదో నిరాశా నిస్పృహ తనను ఆవరిం చాయి. ప్రొద్దుపోవటానికి ఏదయినా కాలక్షేప మయితే బాగుణ్ణు అనిపించింది. చివరకు ఏదైనా ఉద్యోగం చేద్దామని ఒకటే, రెండు ఉద్యోగాలకు అప్లికేషన్లు పెట్టింది.

ఇంటర్వ్యూకు రమ్మని కాల్ వచ్చింది. నాన్నగారివద్దకువెళ్లి తను వెళుతానంది. నాన్నగారు మండిపడ్డారు "మేమేమీ అంత గతిమాలినవాళ్లమనుకొన్నావా! నిన్ను పోషించే శక్తి మాదగ్గిరలేదా!" అని ఇక లాభం లేదు అనుకొని అన్నయ్య వద్దకువెళ్లి తన అవస్థనంతా వెళ్లగక్కు కుంది "అస్తమానం ఇంట్లోకూర్చుంటే తనకు ఏమీ తోచటం లేదనీ, ఇరుగూ పొరుగూ అమ్మ లక్కల బాధ తను పడ లేక పోతున్నాననీను."

అన్నయ్య ఆలోచించి "అయితే శ్రీకాంత్‌వద్దకు వెళ్లే ఉద్దేశ్యమే లేదా నీకు" అన్నాడు.

"నా సంగతి నీకు తెలిసి అడుగు తున్నావుకదు అన్నయ్యా! ఆయనే ఒక్క ఉత్తరం కూడా వ్రాయకుండా అంత బెట్టుగా ఉన్నప్పుడు ఇక మనమేనా"

"సరే నీ ఇష్టమమ్మా. నిన్ను పోషిం చటం మాకు భారంకాదు కానీ ఇలా గయితే నీ జీవితం, నీ కాపురం ఏమవు తుందమ్మా. ఆలోచించు" అన్నాడు.

"అన్నయ్యా పెళ్లి కానివాళ్లు నా ఈడువాళ్లు ఎంతమంది ఉద్యోగాలు చేసుకొంటూ బ్రతకటంలేదు? అలాగే నేనూ నా జీవితాన్ని గడుపుదామనుకొంటు న్నాను...."

చివరకు ఎలాగో ఒప్పుకొన్నాడు అన్నయ్య. ఎలాగో ఒకలాగు నాన్నగారిని ఒప్పించాడు ఇంటర్వ్యూలో సెలక్టయింది. ఉద్యోగంలో ప్రవేశించింది. మొన్న ఈ మధ్యనే నాన్నగారికి ట్రాన్స్‌ఫరయి అందరూ బందరు వెళ్లిపోయారు అన్నయ్య నాగా ర్జునసాగర్‌లో ఇంజనీరుగా పని చేస్తు న్నాడు వదినకూడా అన్నయ్యవద్దకు వెళ్లిపోయింది

తను మాత్రము ఉద్యోగము వదిలిపెట్ట నని మొండికేయుటమువలన బామ్మను మాత్రం తనకు తోడుగా ఉంచి వెళ్లి పోయారు

ఆలోచనలతో ఇంటికి వచ్చింది రమ.

"ఏమ్మా అప్పుడే వచ్చావు?" నాప మీద పడుకొన్న బామ్మ ప్రశ్నించింది,

"ఏంలేదు బామ్మ. ఇవ్వాళ సెలవు పెట్టివచ్చాను" అంది జోళ్లువిడుస్తూ. ఇంతలో ఆఫీసు ప్యూను సైకిలుమీద వచ్చాడు "అయ్యగారు మీ సెలవు మంజూరు చేయరట. మిమ్మల్ని వెంటనే పిల్చుకురమ్మన్నారు."

"నా ఒంట్లో అసలేం బాగోలేదు. నేను ఇప్పుడు ఆఫీసుకు వచ్చి పనిచేసే స్థితిలో లేను నాకీ ఉద్యోగము లేక పోయినాసరే! వెళ్లు ఆ మాటే చెప్పు మీ ఆఫీసరుతో" విసురుగా లోపలి వెళ్లిపోయింది రమ

ప్యూన్ వెళ్లిపోయాడు.

బామ్మకు ఇదంతా ఏమిటో అర్థం కాలేదు అయినా ఆఫీసు గొడవ తన కెందుకులే అనుకొని గీతాపారాయణలో మునిగిపోయింది బామ్మ

"ఇంటికి వచ్చిన రమకు మనసంతా



**త్వరపడండి!త్వరపడండి!!త్వరపడండి!!**



నిరాశపొందకుండుటకు నేడే మీ ఆర్డరు పంపండి. మిక్కిలి అందమైన నమూనాలలో రంగులలో, శ్రేష్టమైన కాశ్మీర్ చేనేత చీరలు గలవు స్టాకు కొద్దిగా వుంది వెంటనే తీసికోండి ఒక చీర రు 7. రెండుచీరలు రు. 13 మూడు చీరయ రు. 17-50 డీలక్స్ క్వాలిటీ ఒకటి రు. 10. రెండు రు 19 మూడు రు 27 (సూపర్ ఫైన్ రు. 20, రెండు రు. 38, మూడు రు. 55) ఉచిత బహుమతులు ఒకటిగాదు, రెండు అనగారెండు చీరలకు ఒకజతషయర్ టాప్స్, ఒక జాకెట్ గుడ్డ పంపబడును. మిఆర్డనుఇంగ్లీషులోనే వ్రాయండి

THE ROYAL STORES

(Sarees Deptt APTWA)

Post Box No. 1774, Delhi—6





ఏజెంట్లు కావలెను

గుడ్‌లక్ కాశ్మీరీ టూష్ (శాల్వ) ఆకర్షణీయమైన షరతులు, రాబడిమీద అమ్మటకు పార్టు టైమ్ ఏజెంట్లు కావలెను బహుమతులు అదనము. నేడే ఉచిత శాంపిల్సుకు, రంగు రంగుల కేటలాగునకు వ్రాయగోరుచున్నాము.

Goodluck Knitting Works (Regd), Kalyanpura (A. P M) Delhi—6



నేషనల్ ట్రాన్సిస్టర్

జపానుచే కనుగొనబడిన జేబు రేడియో. పెద్ద రేడియోలాగ పలుకుతుంది. అన్ని ట్రాన్సిస్టర్లు, లౌడ్ స్పీకర్లు గ్యారంటీ, జపాను తయారీ. మీ



ఇష్ట ప్రకారము ఎక్కడనైనా సంగీతం, వార్తలు వగైరా వినవచ్చు. ప్రపంచమందలి ప్రతి స్టేషనస్థానికంగా వినబడునట్లు గ్యారంటీ. వినటానికి సిద్ధంగ పంపబడును. టార్చి సెల్స్‌తో పనిచేయును అనువైనది, అందమైనది, తేలికైనది 3 సంll గ్యారంటీ. డీలక్సునెం TR 45 ధరరు 68/—వి పి.పి ఛార్జీలు రు. 6/— రేడియో లెదర్ కేసు రు. 7/—

INDOJAP ARTS (WAPT-68)

Beat No. 13, Aligarh.


# తొలగిన తెరలు

అల్లకల్లోలమైపోయింది. ఎటూతోచటం లేదు కలెక్టరు శ్రీకాంత్ అంటేవారేనా! ఎవరో అనుకొన్నాను ఆ పేర్లుగలవాళ్లు ఎంతమందయినా ఉండచ్చుగదా! అనుకొంది. కానీ తన భర్త శ్రీకాంత్ తన ఆఫీసుకు ఆఫీసరుగా వచ్చాడని తెలిసేప్పటికి పరిస్థితి అయోమయంగా తయారయ్యింది. తను ఇక రేపటినుండి ఆఫీసుకు వెళ్లటమా మానటమా. ఆయన ఆఫీసరు. ఆయనక్రింద తను ఒక చిన్న గుమాస్తా. తనమీద తప్పులువెదకి తనను ఉద్యోగములో నుండి తీసివేయడుగదా అదీ చూద్దాము. మనసు పరిపరివిధాల పోతున్నది. ఏమయినా సరే ఉద్యోగము ఎందుకు వదులుకోవాలి? తనలో బలహీనతను చూచి శ్రీకాంత్ మరికాస్త హేళన చేయడుకదా! ఏమయినాసరే ఉద్యోగము వదులుకోగూడదనుకొంది.

మరునాడు మామూలుగానే ఆఫీసుకు వెళ్లి తన పనిలో నిమగ్నురాలైంది రమ

"అయ్యగారు రమ్మంటున్నారు మిమ్మల్ని" జవానువచ్చి చెప్పి వెళ్లాడు.

గుండెల్లో రైళ్లు పరుగెత్తినయ్. తడబడే కాళ్లతో ఆఫీసరు రూమ్‌కేసి నడిచింది రమ.

"కూర్చోండి" అన్నాడు శ్రీకాంత్ చిరునవ్వుతో రమను చూసి.

"కూర్చోండి" ఎవరో పరాయివ్యక్తిలాగా మాట్లాడుతున్నాడు. అవును ఇప్పుడు తనకి అతనికిగల సంబంధమేమిటి? తను ఏనాడయితే అతనితో చెప్పకుండా ఇల్లువదలి వచ్చిందో ఆనాడే అతనికి తనకుగల సంబంధం విడిపోయిందని మనసును సరిపెట్టుకుంది రమ

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

తిరిగి సమాధానము రాలేదు రమనుండి.

"చూడండి ఆఫీసర్ వచ్చిన రోజునే సెలవు పెట్టకూడదని మీకు తెలియదా? ఇంటికి కబురు చేసినా కూడా రావని తిరిగిపంపారు. అదీకాక ఈ డ్రాఫ్ట్సు నిండా తప్పులే! పనిచేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా చెయ్యాలి. ఏదో ఆడవాళ్లం మేము కూడా ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలా అనుకొంటున్నారేమో? ఉద్యోగం విషయంలో ఆడవాళ్లకయినా మొగవాళ్లకయినా ఉద్యోగ ధర్మాలు ఉద్యోగ ధర్మాలే. అవి అతిక్రమించిననాడు ఉద్యోగానికి నీళ్లొదులుకోవలసి వస్తుంది. మీకు ఇంకా క్రొత్త లాగుంది" ఒక క్రొత్త వ్యక్తిని మందలించినట్లే మందలించాడు శ్రీకాంత్.

"థాంక్స్" అంటూ ఇవతలకువచ్చింది రమ

ఆఫీసర్ చీవాట్లతో రమ ముఖం ఎలా ఉందో అని చూడటానికి ఉబలాట పడుతున్న ఆఫీస్‌స్టాఫ్ కళ్లన్నీ రమ వైపుకు ఒక్కసారిగా తిరిగాయి

మౌనంగా తలవంచుకొని తన సీటు వద్దకు వెళ్లిపోయింది రమ రోజులు గడుస్తున్నాయి యాంత్రికంగా ఆఫీసుకు వెడుతున్నది వస్తున్నది రమ.

శ్రీకాంత్ అప్పుడప్పుడు రమను ఏదో పనున్నట్లుగానే తన రూముకు పిలిపించేవాడు ఆఫీసు విషయాలనుగూర్చి మాట్లాడేవాడు. ఒక్కొక్కసారి అతను ఏదో చెప్పబోయేట్లుండేవాడు ఆఫీసర్, రమ ఇతర వ్యక్తుల్లాగానే ప్రవర్తించేవారు ఆఫీసులో.

బామ్మ, అమ్మా నాన్న దగ్గరికి వెళ్లి వారం రోజులు కావస్తోంది. ఇంకారాలేదు. ఆఫీసునుండి ఇంటికి వచ్చిన రమకు ఏమీ తోచలేదు. కాస్సేపు అలా శ్రీదేవి వాళ్లింటికి వెళ్లివద్దామని బయలుదేరింది అక్కడికి వెళ్లితే శ్రీదేవిలేదు. సినిమాకు వెళ్లిందనిచెప్పింది వాళ్ల అమ్మ చేసేదిలేక ఇంటికి తిరుగుముఖం పట్టింది రమ. అనుకోకుండా అప్రయత్నంగానే పార్కులోకి దారి తీసినయ్ రమకాళ్లు.

కాసేపు కూర్చొని వెళ్లచ్చులే అనుకొని ఒకచోట పచ్చిక బయలుమీద కూలబడింది. పార్కులోని రకరకాల మనుష్యులను చూస్తూ. మైకులోనుండి సన్నగా సంగీతం వినవస్తున్నది. మనస్సుకు ప్రశాంతంగా చాలా హాయిగా ఉన్నట్లనిపించింది.

ఇంతలో ఎవరో మాట్లాడుతూ వస్తున్నట్లనిపించింది. తలెత్తిచూసింది. శ్రీకాంత్, ప్రక్కన అధునాతనంగా అలంకరించుకొన్న ఒక స్త్రీతో మాట్లాడుతూ వస్తున్నాడు. తనలో దాగివున్న స్త్రీ సహజమయిన అసూయానుమానాలు ఒక్కసారిగా విజృంభించి శ్రీకాంత్‌పట్ల అదివరకున్న ప్రేమనీ గౌరవాన్నీ అణచి

కేసి వాటి స్థానాన్ని ఆక్రమించుకొన్నాయి. చివాల్న లేచి నిలబడింది రమ

"అరే రమా నీవు ఇక్కడున్నావా! ఈమె లయోలా కాలేజిలో లెక్చరర్. పేరు సులేఖ. ఒకవిధంగా నా క్లాస్‌మేట్ కూడాను ఈమె ఈ వూర్లో పని చేస్తున్న సంగతి నాకు ఇప్పటివరకూ తెలియదు ఇప్పుడే తెలుసుకొన్నాను" అన్నాడు

"కాంత్ ఈమె ఎవరు?" విలాసంగా రమవంక నవ్వుతూ చూస్తూ ప్రశ్నించింది.

రమకు చికాకనిపించింది ఆమె ప్రవర్తనకు. ఆయనమీద సర్వాధికారాలున్నట్లే మాట్లాడుతున్నది" అనుకొంది మనసులో.

"ఈమెనా. . రమవంక నవ్వుతూ చూశాడు శ్రీకాంత్. రమే అందుకొంది. "నేను వారి ఆఫీసులో ఒక యల్.డి.సి.ని" అంది ముక్తసరిగా.

"అలాగా వస్తాను మాటల సందర్భములోపడి ఇంటి సంగతి మర్చిపోయాము. కాలేజినుండివస్తూ మీరు అగుపడితే పేరుగా ఇటే వచ్చేశాను ఇంటివద్ద ఎదురు చూస్తుంటారు గుడ్‌బై కాంత్ నీవూ రావా, నేను రిక్షా ఎక్కేంతవరకయినా నాకు తోడుగా రా మాట్లాడుతూ వెళదాము" అంటూ శ్రీకాంత్‌ను బలవంతంచేసి అతని వెంటనే నడక సాగించింది పార్కు బయటకు సులేఖ. చేసేదిలేక విధిగా బయటికి నడిచాడు శ్రీకాంత్

రమ మనసులో పరిపరి విధాల ఆలోచించసాగింది ఇప్పటి పరిస్థితినిగురించి ఇక తన ఆఖరు ఆశ కూడా సడలిపోయింది శ్రీకాంత్‌కు పెద్ద పెద్ద అధికారంగల లేడీ ఫ్రెండ్స్ ఉన్నారని తనకు చూపించటానికే తనముందు అలా ప్రవర్తించాడా! నా ఫ్రెండ్స్‌ముందు నీవు ఎంత అనా, తన ఉద్దేశ్యము? ఇంకా ఎంతమంది లేడీ ఫ్రెండ్స్ ఉన్నారో ఆయనకు చివరకు తన జీవితము ఏవిధంగా తయారయ్యింది భగవాన్. ఒక్కొక్క జీవితాన్ని ఏవిధంగా సృష్టిస్తావు. తను ఎవరికోసం ఈ జీవితాన్ని ఈవిధంగా గడుపుతున్నది? తను ఎందుకు బ్రతకాలి? తన బ్రతుకు విలువ ఎంత? ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని తన దుఃఖాన్ని పోగొట్టేవారే లేరా? తన మానసిక వ్యధను పాలుపంచుకొనే వారే లేరా? నడుస్తున్న రమకు అంతా శూన్యంగా తోచింది. కళ్ళు తిరుగు


నిరాశ చెందవద్దు
దాంపత్య జీవితంలోని బలహీనతగూర్చి మీరు చింతపడవద్దు
## జీవన స్పెషల్



రుచియైన ఆయుర్వేదటానిక్. ఉత్తమగుణములుగలది కోల్పోయినశక్తినిచేకూర్చి మీ దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేస్తుంది. స్త్రీలు ప్రసవానంతరం "జీవన స్పెషల్" సేవించిన, యౌవనులుగా నుందురు
ఎక్కువ ఫలితానికి.—
పాలువాడటం మంచిది — కావలసినంత దేహ వ్యాయామము చేయవలెను — గ్రుడ్లు వాడరాదు.
ముఖ్య గమనిక జీవన స్పెషల్ మీ దేహాన్ని తొందరగా పోషించు శక్తిగలది కాబట్టి రెండు వారములు సేవించిన తర్వాత ఒక వారంరోజులు మానివేయుట చాల అవసరం. లేనియెడల లావైపోదురు. లేక దాంపత్యవాంఛ అధికమగును.
ఆరోగ్యం, బలం చేకూరినవెంటనే మానివేయవలెను. 450 గ్రాముల ప్యాకింగ్‌లో లభించును ధర రు.10/-

## అమృత లేపనం (పురుషులకు మాత్రము)

దాంపత్య జీవితములో తీవ్రమైన లేక జీర్ణించిన అన్ని రకాల బలహీనతలకు శక్తివంతమైన ఔషధము. (పైపూతకు మాత్రము) 25 M.L.L. సీసా 1 కి ధర రు. 10/- విశదం.
ఉచిత కరపత్రములకు వ్రాయండి ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయవలెను. అన్ని ఆర్డర్లతోపాటు ఔషధము ధరలో సగం పంపవలెను. మిగతమొత్తమునకు వి. పి. పి. పంపబడును ప్యాకింగు మరియు ఫార్వర్డింగ్ ఛార్జీలు అదనం. *Orders to:*

**Jeevamritham Oushadha Sala,**
CALICUT - 1 (S. India)
Chief Physician, Dr. K. N. RAMDAS Phone 2419 & 3607
గమనిక ఆంధ్ర, మధ్యప్రదేశ్ మరియు ఒరిస్సాలలోని అన్ని ముఖ్య పట్టణములకు స్టాకిస్టులు కావలెను షరతులకు, నిబంధనలకు వ్రాయండి



అన్నారుబా. తను ఏటు వెళ్ళుతున్నదో తనకే తెలియటంలేదు తనలోని మానసిక క్షోభ అంతా తనను అధఃపాతాళానికి కృంగతీసింది

కళ్ళు తెరచి చూచేప్పటికి ఒకమెత్తని పరుపుమీద పడుకొనిఉంది రమ ఆకాశం లోని శుక్లపక్ష త్రయోదశి చంద్రుడు నిర్మలంగా వినువీధిలో పయనిస్తూ తన శీతాంశు కిరణములను వెదజల్లుతున్నాడు నక్షత్రాలు అక్కడక్కడా మినుకు మినుకు మంటున్నయ్.

గడియారం టంగ్ టంగ్‌మనిపన్నెండు గంటలు కొట్టింది ఉలిక్కిపడింది రమ తను ఇప్పుడు ఎక్కడున్నది? అసలు ఏం జరిగింది? ఎదురుగా కుర్చీలో కునికిపాట్లు పడుతున్నాడు శ్రీకాంత్

"నేను ఇప్పుడు ఎక్కడున్నాను? అంటూ లేవబోయింది రమ"

"ఆ, ఆ లేవవద్దు, విశ్రాంతి తీసుకో

## తొలగిన తెరలు

డాక్టరు పూర్తిగా రెస్టు కావాలన్నాడు" అన్నాడు శ్రీకాంత్

"అసలేం జరిగిందో చెప్పండి! నేను ఇక్కడి కెలా వచ్చాను?" రమ ముఖంలో ఆత్రుత తొణికిసలాడింది

నీవు రోడ్డు మీద వెళ్తూ వెళ్తూ అలానే స్పృహతప్పి పడిపోయావు. కొంచెం ఉన్నట్లయితే కారు యాక్సిడెంట్ జరిగేదే పాపం ఆయనెవరో సడన్ బ్రేకు వేసి ఆపాడు కారుని సులేఖను రిక్షా ఎక్కించి తిన్నగా కారు డ్రైవ్‌చేసుకొంటూ వస్తున్నాను కొంచెం దూరం వచ్చేసరికి ఈ గలభా జరుగుతోంది. ఎవరా అని చూస్తే నువ్వు ఆపళాన నిన్ను నాకార్లో ఎక్కించి ఇక్కడికి తీసుకవచ్చి డాక్టరుకు ఫోన్ చేశాను. మీ ఇంటికి జవాన్ని పంపాను. ఎవరూ లేరు ఇంటికి తాళం వేసి ఉన్నదని వచ్చి చెప్పాడు డాక్టరు గారు వచ్చి ఇంజక్షను ఇచ్చారు ఏం ఫర్వాలేదు మానసికంగా ఈమె చాలా బలహీనంగా ఉంది ఏ విధమయిన మానసిక సంఘర్షణలు జరిగే పరిస్థితులు కల్పించ వద్దు తెలివి వచ్చిన తరువాత ఈ బిళ్ళలు వేసి వేడి వేడి కాఫీనో లేక హార్లిక్సో ఏద్తైనా సరే ఇవ్వ మన్నారు. ఈ మాత్రలు వేసుకో నేను కొంచెం హార్లిక్స్ కలిపి తెస్తాను." అంటూ లేచాడు శ్రీకాంత్.

"ఏమొద్దు మీ సహాయానికి చాలా కృతజ్ఞురాలిని నాకిప్పుడు బాగానే శక్తి వచ్చింది ఇక ఇంటికి వెళుతాను" అంటూ లేచింది రమ

"ఇప్పుడా, ఇంటికా, చూడు రమా నన్నింకా పరీక్ష చేస్తున్నావా? ఆఫీసులో కూడా నే నెన్నోసార్లు కల్పించుకోబోయినా, ఎవరో క్రొత్త వ్యక్తిగా పరాయి దానిలాగా ప్రవర్తించావు నీ మాటను నీవు నిలబెట్టు కొన్నావు నీ వ్యక్తిత్వ మ్మీద నీకున్న ఆత్మ విశ్వాసానికి నేను చాలా సంతోషించాను నేనే వోడిపోయాను. నీముందు నా వోటమిని పశ్చాత్తాపంతో అంగీకరిస్తున్నాను నేను నీ పట్ల మూర్ఖంగా ప్రవర్తించి నా సర్వస్వాన్ని కాల దన్నుకొన్నాను నీవు వెళ్ళిపోయిన తరువాత తెలిసి వచ్చింది నీవు లేని లోటు ఏమిటో. ఇక మన ఇద్దరి మధ్యాగల మసక తెరలు తొలగి పోయినయ్ నీవు వెళ్ళిపోయిన తరువాత ఎన్నో సార్లు నీకు ఉత్తరం రాయాలని ప్రయత్నించాను. కానీ నిన్నింత బాధ పెట్టిన ఈ నీచు."

శ్రీకాంత్ నోటికి అడ్డంగా చెయి పెట్టింది రమ "వూరుకోండి, తప్పంతా నాదే. మీ అమృత హృదయాన్ని అర్థం చేసుకోలేక తొందరపడి ప్రవర్తించాను. మిమ్మల్ని ఒంటరివార్ని చేసి చాలా బాధ కలిగించాను నన్ను క్షమించరూ!" అంటూ శ్రీకాంత్ హృదయం మీద వాలిపోయింది.

"నా పిచ్చి రమా ఇప్పుడు తెలిసిందా, రమలేని కాంతుడు, చంద్రుడు లేని వెన్నెల వంటి వాడని ఇక మనల్ని ఎవ్వరూ వేరు చేయలేరు" అంటూ హృదయానికి గాఢంగా హత్తుకొన్నాడు శ్రీకాంత్. ●




"ఏడుకొండలవాడి పుణ్యమా అని ఈ పూటా నుంచి "కల్టనే" గురూ."